నమస్తే తెలంగాణ

# కరీంనగర్

5 | కరీంనగర్, సోమవారం 3 జూన్ 2024 | KARIMNAGAR






కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కోలేటి దామోదర్, పక్కన రసమయి, కేటీఆర్‌తో గంగుల

# దశాబ్ది వేడుకల్లో మనోళ్లు



కేటీఆర్‌తో హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



వేడుకల్లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

## తెలంగాణ భవన్‌లో జరిగిన సంబురాల్లో జిల్లా నేతలు

కరీంనగర్, జూన్ 2(నమస్తే తెలంగాణ) హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్యక్షతన జరిగిన దశాబ్ది ముగింపు వేడుకలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పాల్గొని కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపి, ప్రసంగించారు. ఇక్కడ ఉమ్మడి జిల్లా నుంచి సిరిసిల్ల, కరీంనగర్, హుజూరాబాద్, జగిత్యాల ఎమ్మెల్యేలు కేటీఆర్, గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్, బీఆర్ఎస్ కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులు బోయినపల్లి వినోద్‌కుమార్, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు కోలేటి దామోదర్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



దశాబ్ది ఉత్సవాల్లో కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బీ వినోద్‌కుమార్

# నేడు సిరిసిల్లలో కేటీఆర్ పర్యటన

**దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాలకు హాజరు**

రాజన్న సిరిసిల్ల, జూన్ 2(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సోమవారం సిరిసిల్లలో పర్యటించనున్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలో నిర్వహించే కార్యక్రమాలకు హాజరవుతారు. ఉదయం 10 గంటలకు నేతన్న చౌక్‌లోని అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం 10.30 గంటలకు రగుడు చౌరస్తాలోని తెలంగాణ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. 11 గంటలకు కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు.

## జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తాం

**కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి**

స్వరాష్ట్ర సాధన స్ఫూర్తితో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపర్చడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తున్నదని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. అందరి సహకారంతో జిల్లాను సర్వతోముఖాభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఈ యాసంగి సీజన్‌లో 2,03,096 మంది రైతులకు రూ.182కోట్ల 12లక్షల ఐదు వేలు పెట్టుబడి సాయంగా అందించినట్లు వెల్లడించారు. సరిపడా విత్తనాలు కూడా సరఫరా చేస్తున్నామని నకిలీ విత్తనాలను అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ బృందాలతో నిరంతరం తనిఖీలు చేయిస్తున్నట్లు చెప్పారు. పౌరసరఫరాల శాఖ ద్వారా జిల్లాలో 2023–24 సంవత్సరానికి సంబంధించి వానకాలం, యాసంగి సీజన్లో 4 లక్షల 86వేల 603 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 45 వేల మంది నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీరికి రూ.1,071 కోట్ల మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా నేరుగా చెల్లించామన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న వివిధ పథకాల గురించి వివరించారు. అనంతరం వేడుకల ముగింపులో భాగంగా మహిళల కోలాట నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కళాకారుల పాటలు అలరించాయి. కరీంనగర్‌లో జరిగిన వేడుకల్లో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో కే మహేశ్వర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, మున్సిపల్ కమిషనర్ బీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




జెండా వందనం సమర్పిస్తున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, మేయర్ సునీల్‌రావు

## పర్యాటకంగా తీర్చిదిద్దుతాం

**పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్**

పెద్దపల్లి జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దుతామని, ముఖ్యంగా రామగిరిఖిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. అమరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ రాష్ట్రం పదేండ్లలో అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే దిక్సూచిలా నిలిచిందన్నారు. ప్రజావాణి ద్వారా ప్రజలకు సమస్యలు చెప్పుకొనే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. మహాలక్ష్మి కింద అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణాన్ని జిల్లాలో ఇప్పటి వరకు 88.56 లక్షల మంది వినియోగించుకున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. పెద్దపల్లిలో జరిగిన వేడుకల్లో అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్, ఏసీపీ జీ కృష్ణ, పెద్దపల్లి ఆర్డీవో బీ గంగయ్య పాల్గొన్నారు.



మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, చిత్రంలో అదనపు కలెక్టర్లు



జెండావందనం సమర్పిస్తున్న సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్

## అమరుల త్యాగాల ఫలం

**రాజన్న సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి**

ఎందరో అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ ఆవిర్భవించిందని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. తెలంగాణ సిద్ధించి పదకొండో వసంతంలోకి అడుగిడిన సందర్భంగా ఆవతరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పదేండ్లలో రాష్ట్రం అన్నింటా ప్రగతి పథంలో పయనించి దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సమర్థ వంతంగా పనిచేసి విజయవంతంగా పూర్తి చేసిన ఉద్యోగులు, అధికారులు, పోలీస్ సిబ్బందిని అభినందిస్తున్నానన్నారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. సిరిసిల్లలో జరిగిన వేడుకల్లో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, జడ్పీ సీఈవో ఉమారాణి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

# ఆవిర్భావ సంబురం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా దశాబ్ది ఉత్సవాలు
- కలెక్టరేట్లలో జాతీయ పతాకాల ఆవిష్కరణ
- హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సంబురాలు అట్టహాసంగా జరిగాయి. ఊరూరా ప్రత్యేకాధికారులు మువ్వన్నెల పతాకాలను ఆవిష్కరించారు. కరీంనగర్ సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ పమేలా సత్పతి, సిరిసిల్లలో అనురాగ్ జయంతి, జగిత్యాలలో యాస్మిన్ బాషా, పెద్దపల్లిలో ముజామ్మిల్‌ఖాన్ జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి వేడుకలకు హాజరైన వారినుద్దేశించి ప్రసంగించారు. వేడుకల్లో భాగంగా కళాకారులు ఆటపాటలతో హోరెత్తించారు.

- కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 2



జగిత్యాలలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

## అన్నింటా అగ్రగామి

**జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా**

అమరుల త్యాగాలతో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం ఈ పదేండ్లలో అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిచిందని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. మన ఘనమైన సంస్కృతీ సంప్రదాయాలను భావి తరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. తెలంగాణ అనేక చారిత్రక ప్రదేశాల సమాహారమని చెప్పారు. ప్రజలందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నా మన్నారు. ముఖ్యంగా మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, మేధావులు, కవులు, కళాకారులు, విద్యార్థులు, యువత, మహిళా, జర్నలిస్టులకు అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు జగిత్యాల పట్టణంలోని అమరుల స్తూపం వద్ద ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి నివాళులర్పించారు.

# వర్ష బీభత్సం

- చల్లబడ్డ వాతావరణం
- విరిగిపడ్డ చెట్లు..స్తంభాలు
- కరెంట్‌సరఫరాకు ఆటంకం
- రేగడిమద్దికుంటలో పిడుగుపాటుకు ఎద్దు మృతి



చందుర్తి: కోరుట్ల - వేములవాడ రహదారిపై విరిగిపడ్డ చెట్టు

మంథని/మంథని రూరల్/సుల్తానాబాద్/ జూలపల్లి/పెద్దపల్లి రూరల్/ చందుర్తి/ ఇల్లంతకుంట/కథలాపూర్/శంకరపట్నం జూన్ 2: పొద్దంతా ఎండ దంచికొట్టగా ఆదివారం సాయంత్రం ఆకస్మాత్తుగా ఈదురుగాలులతో వర్షం కురిసింది. రోడ్లపై చెట్లు, స్తంభాలు విరిగిపడడంతో కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఉప్పట్లలో బిరుదు సత్తయ్య ఇంటిపై తాటిచెట్టు పడడంతో నేలమట్టమైంది. జూలపల్లిలో గాలి దుమారానికి ఓ ఇంటిపై కప్పు రేకులు లేచిపోయాయి. ముత్తారం, మండలంలోని అడవిశ్రీరాంపూర్‌లో తాటి, కొబ్బరిచెట్లపై పిడుగులు పడడంతో మంటలు చెలరేగాయి. పెద్దపల్లి మండలం హన్మంతునిపేట, భోజన్నపేట శివారులో చెట్లు విరిగిపడడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో తాటిచెట్టుపై పిడుగుపడ్డది. ఇల్లంతకుంట మండలం వంతడుపులలో ఓ చెట్టు విరిగిపడ్డది. రేకుల షెడ్డు కుప్పకూలింది. కథలాపూర్ మండలం సిరికొండలో అమీర్ రైస్‌మిల్లుపై గల రేకులు ఎగిరిపోయాయి. కరీంనగర్ జిల్లా శంకరపట్నంలోని పలు గ్రామాల్లో సాయంత్రం ఆకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. పలుచోట్ల వృక్షాలు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.



ముత్తారం: పిడుగు పాటుతో చెట్టుపై చెలరేగిన మంటలు



జూలపల్లి-అబ్బాపూర్ గ్రామాల మధ్య రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు



ఇల్లంతకుంట మండలం వంతడుపులలో ఈదురు గాలులకు కూలిన రేకుల షెడ్డు



కథలాపూర్: సిరికొండ శివారులో రైస్‌మిల్ కార్యాలయంలో గాలికి రేకులు ఎగిరిపోవడంతో చిందరవందరగా వస్తువులు

# లెక్కింపు ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలి

**పరిశీలకురాలు నజ్మా**

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 2 : మంగళవారం నిర్వహించనున్న పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం చేపడుతున్న ఏర్పాట్లు పక్కాగా ఉండాలని లెక్కింపు పరిశీలకురాలు నజ్మా సూచించారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాలలో గల స్ట్రాంగ్ రూం, లెక్కింపు కోసం చేపడుతున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల లెక్కింపు హాళ్లను ఆమె పర్యవేక్షించారు. ఏర్పాట్లపై అధికారులను వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తగిన ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేసి, సకాలంలో లెక్కింపు పూర్తయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఫలితాల ప్రకటనలో ఎలాంటి జాప్యం జరుగకుండా చూడాలన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేశ్‌బాబు, రామ్మూర్తి, రమేశ్, తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లపై వివరాలడిగి తెల్సుకుంటున్న లెక్కింపు పరిశీలకురాలు నజ్మా

# వినోద్‌కుమార్ గెలువాలని పాదయాత్ర



**కరీంనగర్ నుంచి కొండగట్టుకు నడిచి వెళ్లి మొక్కులు చెల్లింపు**

మల్యాల, జూన్ 2 : కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా బోయినపల్లి వినోద్‌కుమార్ గెలువాలని ఆయన అభిమాని కరీంనగర్ నుంచి కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం వరకు పాదయాత్ర చేశాడు. కరీంనగర్‌కు చెందిన పూసల పవన్ అనే యువకుడు నడుచుకుంటూ కొండగట్టుకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నాడు.

## దుడ్డెపై చిరుత దాడి

కోనరావుపేట, జూన్ 2 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం సత్యనారాయణపల్లె శివారులో చిరుతదాడి చేయడంతో దుడ్డె మృతిచెందింది. ఫారెస్ట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దడిగె లక్ష్మీనర్సు అనే రైతుకు చెందిన బర్రె, దుడ్డెను సత్యనారాయణపల్లె వద్ద ఉన్న తన వ్యవసాయక్షేత్రంలో రోజుమాదిరిగానే కట్టేశాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వెళ్లి చూసే సరికి దుడ్డె మృతిచెంది ఉంది. విషయం తెలుసుకున్న ఎఫ్ఎస్‌వో బాపురాజు, బీట్ ఆఫీసర్ లావణ్య అక్కడకి చేరుకుని దుడ్డె కళేబరాన్ని పరిశీలించారు. అక్కడి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి చిరుత దాడిలోనే దుడ్డె మృతిచెందినట్లు గుర్తించారు. అనంతరం పంచనామా చేశారు.

# 4న ట్రాఫిక్ మళ్లింపు

**సీపీ అభిషేక్ మొహంతి**



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

రాంనగర్, జూన్ 2: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈ నెల 4న మంగళవారం కౌంటింగ్ కేంద్రం (ఎస్సారార్ కాలేజీ) ఎదుట గల రోడ్డుపై నుంచి వాహనాలను అనుమతించబోమని కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి ఒకప్రకటలో తెలిపారు. జగిత్యాల నుంచి కరీంనగర్‌కు వచ్చే వాహనాలు రేకుర్తి చౌరస్తా వద్ద నుంచి శాతవాహన యూనివర్సిటీ, పద్మనగర్ మీదుగా నగరంలోకి చేరుకోవాలని, కరీంనగర్ నుంచి జగిత్యాలకు వెళ్లే వాహనాలు కోర్ట్ కాంప్లెక్స్ దాటగానే జ్యోతినగర్, కెమిస్ట్రీ భవన్, శాతవాహన యూనివర్సిటీ, రేకుర్తి చౌరస్తా వద్ద జగిత్యాల రోడ్డు వైపు వెళ్లాలని సూచించారు. బ్యాంకు కాలనీలో గల డీ మార్ట్ రోడ్డు వైపు నుంచి వచ్చే వాహనాలు బ్యాంకు కాలనీ రోడ్డు నంబర్ వన్ మీదుగా స్థానిక స్పెన్సర్స్ వద్ద గల రోడ్డు నుంచి నగరంలోకి వెళ్లాలన్నారు. స్పెన్సర్ నుంచి ఆర్టీసీ వర్క్‌షాప్, ఇటు డీ మార్ట్ వరకు స్టెరైల్ జోన్‌గా నిర్ణయించారని ఇక్కడ ఎలాంటి వాహనాలు తిరగడానికి అనుమతిలేదని వెల్లడించారు. అలాగే, కరీంనగర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం ఉదయం 6 వరకు, ఒకవేళ రీ-కౌంటిగ్ జరిగితే అవికూడా ముగిసేవరకు అమల్లో ఉంటాయని తెలిపారు. ఐదుగురికి మించి గుమికూడవద్దని తెలిపారు. ఏదేని ప్రత్యేక పరిస్థితుల్లో పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు.



హర్షం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంపై సంబురాలు

కమాన్‌పూర్, జూన్ 2 : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ నేతలు కమాన్‌పూర్ మండల కేంద్రంలో సంబురాలు జరుపుకొన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద పటాకలు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొమ్మగాని అనిల్, ఉప్పరి శ్రీనివాస్, పొన్నం రాజేశ్వరి, నీలం సరిత, తాటికొండ శంకర్, కొండా వెంకటేశ్, ఆకుల గట్టయ్య, గుర్రం లక్ష్మీమల్లు, నీలం శ్రీనివాస్, రాచకొండ రవి, బొల్లపల్లి శంకర్ గౌడ్, జాబు సతీశ్, సాగర్ల పవన్, గుడిసెల లింగస్వామి, మేకల సందీప్ యాదవ్, తోట రాజ్‌కుమార్, అకినెపల్లి సుధాకర్, రవి పాల్గొన్నారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571